ఈడీ కస్టడీకి కేజ్రీవాల్

- 28 వరకు అప్పగించిన ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు
- మద్యం పాలసీ ప్రధాన కుట్రదారు ఆయనే: ఈడీ
- ఆధారాలు లేని ఆరోపణలన్న కేజ్రీవాల్ లాయర్లు
- జైల్లో ఉన్నా సేవ కొనసాగిస్తానన్న ఆప్ అధినేత
- కేజ్రీని సీఎంగా తొలగించాలి: ఢిల్లీ హైకోర్టులో పిటిషన్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం ఏడు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అప్పగించింది. విచారణ నిమిత్తం కేజ్రీవాల్‌ను పదిరోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న ఈడీ విజ్ఞాపనను పరిగణనలోకి తీసుకొన్న ధర్మాసనం ఈ నెల 28 వరకూ కస్టడీకి అనుమతించింది. అంతకు ముందు కోర్టులో వాదనలు వాడీవేడీగా సాగాయి. మద్యం పాలసీ కేసులో ప్రధాన కుట్రదారు కేజ్రీవాలేనని ఈడీ ఆరోపించింది. పాలసీ రూపకల్పన, అమలు కోసం ఆయన కోట్లాది రూపాయల నిధులను తీసుకొన్నట్టు పేర్కొంది. ఈ డబ్బును పంజాబ్, గోవా ఎన్నికల కోసం వినియోగించినట్టు తెలిపింది. 'మద్యం పాలసీ కేసులో కేజ్రీవాలే కింగ్‌పిన్. సౌత్‌గ్రూప్‌నకు, నిందితులకు మధ్య ఆయన మధ్యవర్తిగా వ్యవహరించారు' అని ఈడీ ఆరోపించింది. అయితే, ఎలాంటి ఆధారాలు లేకుండా కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని కేజ్రీ న్యాయవాదుల బృందం ఈడీ వైఖరిని తప్పుబట్టింది. ఈ కేసులో న్యాయమూర్తి, న్యాయస్థానం, శిక్ష అమలు వంటి మూడు పాత్రలను ఈడీనే పోషిస్తున్నదని మండిపడింది. మరోవైపు, తన అరెస్టును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో గురువారం రాత్రి దాఖలు చేసిన పిటిషన్‌ను కేజ్రీవాల్ శుక్రవారం ఉదయం ఉపసంహరించుకొన్నారు. ట్రయల్ కోర్టులో రిమాండ్ ప్రొసీడింగ్స్ ఉన్నందుకే పిటిషన్‌ను వెనక్కి తీసుకొన్నట్టు కేజ్రీవాల్ తరపు న్యాయవాదులు తెలిపారు.

సేవ చేయడాన్ని కొనసాగిస్తా..

తన అరెస్టుపై కేజ్రీవాల్ తొలిసారిగా స్పందించారు. 'ఈ దేశానికి సేవ చేయడానికే నా జీవితాన్ని అంకితం చేశా. జైల్లో ఉన్నా.. బయట ఉన్నా అది కొనసాగిస్తా' అన్నారు. మరోవైపు, అరెస్టయిన కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలని ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. కేజ్రీవాల్ నివాసంలో గురువారం సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఈడీ అధికారులకు 150 పేజీల డాక్యుమెంట్లు దొరికాయని, అందులో దర్యాప్తు సంస్థకు చెందిన స్పెషల్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ ర్యాంకుకు చెందిన ఇద్దరు అధికారుల కీలక సమాచారం ఉన్నదని జాతీయ మీడియా పేర్కొంది. ఈ ఇద్దరిలో ఒకరు గురువారం జరిగిన సోదాల్లో పాల్గొన్నారని తెలిపింది. ఈడీ అధికారుల వివరాలను కేజ్రీవాల్ సేకరించడం వెనుక ఉన్న కారణాలను శోధిస్తున్నట్టు అధికారి ఒకరు పేర్కొన్నారు.

బెంగాల్ మంత్రి నివాసంలో ఈడీ సోదాలు

- మరో తృణమూల్ నేత ఇంట్లో ఐటీ అధికారుల తనిఖీలు
- ప్రతిపక్ష పార్టీల నేతలే టార్గెట్‌గా కేంద్ర దర్యాప్తు ఏజెన్సీల దాడులు!

చంద్రనాథ్

కోల్‌కతా, మార్చి 22: లోక్‌సభ ఎన్నికల ముందర విపక్ష పార్టీలకు చెందిన నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు కొనసాగుతున్నాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఇప్పటికే ఆప్ అధినేత, సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఈడీ.. శుక్రవారం టీచర్ రిక్రూట్‌మెంట్ కేసులో బెంగాల్ మంత్రి చంద్రనాథ్ సిన్హా ఇంటిపై దాడులు నిర్వహించింది. బీర్భూమ్ జిల్లా బోల్పోరులోని మంత్రి ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు ప్రారంభించారు. అయితే సోదాల సమయంలో మంత్రి పూర్వీకుల గ్రామంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఏ తప్పు చేయలేదని, ఈడీ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేశారు.

మరో కేసులో సీబీఐ సమన్లు

అలాగే రిక్రూట్‌మెంట్ కుంభకోణంలో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై ఈడీ ఏకకాలంలో కోల్‌కతా, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న కొంతమంది వ్యాపారుల ఇండ్లలోనూ సోదాలు నిర్వహించింది. కాగా, ఎంఎస్ఎంఈ, టెక్స్‌టైల్ శాఖలకు మంత్రిగా ఉన్న చంద్రనాథ్‌ను అంతకుముందు పశువులు, బొగ్గు స్మగ్లింగ్ కేసుల్లో సీబీఐ సమన్లు జారీ చేసింది.

మంత్రి సోదరుడి నివాసంపై ఐటీ దాడి

మరోవైపు మంత్రి సోదరుడు, టీఎంసీ నేత స్వరూప్ బిశ్వాస్ నివాసంలో వరుసగా మూడో రోజు శుక్రవారం ఆదాయపు పన్ను(ఐటీ) శాఖ అధికారులు సోదాలు కొనసాగించారు. రెండు రియల్ ఎస్టేట్ కంపెనీలు ఐటీ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతూ మంత్రి అరూప్ బిశ్వాస్ సోదరుడైన స్వరూప్ బిశ్వాస్ ఖాతాకు డబ్బు బదిలీ చేశాయని ఐటీ అధికారి ఒకరు ఆరోపించారు.

జైలు నుంచి పాలన సాధ్యమా?

సులభమేమీ కాదంటున్న న్యాయకోవిదులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టయినప్పటికీ, తమ సీఎం కేజ్రీవాలేనని, తీహార్ జైలు నుంచే ఆయన పాలన కొనసాగిస్తారని ఆప్ నేతలు చెబుతున్నారు. అయితే, స్వతంత్ర భారతంలో సీఎం పదవిలో ఉండగానే అరెస్టయిన తొలి వ్యక్తిగా నిలిచిన కేజ్రీవాల్ జైలు నుంచి పాలన సాగించడం అంత సులభమేమీ కాదని న్యాయ నిపుణులు, జైలు అధికారులు చెబుతున్నారు. తీహార్ జైలు నిబంధనల ప్రకారం.. జైలులో ఉన్న వ్యక్తిని కుటుంబ సభ్యులు, ఇతరులు వారానికి రెండు సార్లు మాత్రమే కలిసే అవకాశముంటుందని జైలు మాజీ అధికారి సునీల్ గుప్తా పేర్కొన్నారు. ఈ నిబంధనలతో పాలన సాగించడం కష్టమవ్వొచ్చని అభిప్రాయపడ్డారు. అయితే, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ప్రత్యేక అధికారాలతో ఏదైనా భవనాన్ని తాత్కాలికంగా జైలుగా మార్చి.. కేజ్రీవాల్‌ను తరలించి పాలనను అక్కడి నుంచి సాగించేలా మార్పులు చేయవచ్చని పేర్కొన్నారు. ఎల్జీ దీనికి ఆమోదం తెలపాల్సి ఉంటుందన్నారు.

2జీ కేసు..సీబీఐ అప్పీల్‌పై విచారణకు ఓకే

న్యూఢిల్లీ, మార్చి 22: 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం కేసులో మాజీ టెలికం మంత్రి ఏ రాజా, ఇతరులను నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం విచారణకు స్వీకరించింది. 2018లో సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను కోర్టు దాదాపు ఆరేండ్ల తర్వాత అనుమతించడం గమనార్హం. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపు కుంభకోణం కేసు వెలుగుచూసిన విషయం విదితమే. 2జీ స్కామ్‌కు సంబంధించి సీబీఐ, ఈడీ కేసుల్లో 2017, డిసెంబర్ 21న ఏ రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి, ఇతరులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ 2018, మార్చి 19న ఈడీ, 2018, మార్చి 20న సీబీఐ హైకోర్టులో పిటిషన్లు వేశాయి.

ఒడిశాలో ఒంటరిగానే బీజేపీ పోటీ

భువనేశ్వర్, మార్చి 22: ఒడిశాలో బీజేపీ, బీజేడీ పొత్తుపై సస్పెన్స్‌కు తెరపడింది. ఈ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సమాల్ శుక్రవారం స్పష్టం చేశారు. సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని అధికార బీజేడీతో పొత్తుపై గత కొన్ని రోజులుగా చర్చలు జరిగినట్టు ఆయన చెప్పారు. అయితే అవి ఫలవంతం కాలేదన్నారు. ఈ క్రమంలో ఒడిశాలో త్వరలో జరగబోయే 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ సీట్లలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని చెప్పారు. బీజేపీ, బీజేడీ 1998 నుంచి 2009 వరకు ఎన్నికల్లో కలిసి పోటీచేశాయి.

సుప్రీంకోర్టు మందలించడంతో తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి వెనక్కి తగ్గారు. శుక్రవారం డీఎంకే సీనియర్ నేత కే పొన్ముడితో మంత్రిగా ప్రమాణం చేయించారు.

రాధికకు పోటీగా కెప్టెన్ కుమారుడు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, 22 మార్చి (నమస్తే తెలంగాణ): తమిళనాడులోని విరుదునగర్ లోక్‌సభ స్థానానికి ఆసక్తికర పోటీ నెలకొంది. అక్కడి నుంచి బీజేపీ తరపున నటి రాధిక శరత్‌కుమార్ పోటీ చేస్తున్నారు. దీంతో ఆమెపై సినీ రంగానికే చెందిన వ్యక్తిని బరిలో దింపాలని అన్నాడీఎంకే, డీఎండీకే కూటమి నిర్ణయించింది. అన్నాడీఎంకే ఎన్నికల పొత్తులో భాగంగా ఆ సీటును డీఎండీకే పార్టీకి కేటాయించింది. డీఎండీకే తరపున ఆ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత విజయ్‌కాంత్ కుమారుడు విజయ ప్రభాకరన్ పోటీ చేయనున్నట్టు పార్టీ ప్రకటించింది.

26న మోదీ ఇంటి ముట్టడి

ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆప్ నాయకులు, కార్యకర్తలు. కేజ్రీవాల్ అరెస్ట్ దుర్మార్గమని, దీని వెనక బీజేపీ ఉన్నదని ఆప్ శ్రేణులు ఆరోపించాయి.

మొదటిపేజీ తరువాయి...

ఆప్ పిలుపునిచ్చింది. ఢిల్లీ ఆప్ కన్వీనర్ గోపాల్ రాయ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 23న (శనివారం) ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిజ్ఞ చేస్తామని, 24న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తామని, 25న తమ పార్టీ హోలీ పండుగను జరుపుకోబోదని తెలిపారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి నెలకొన్నదని ఆప్ నేత సందీప్ పాఠక్ విమర్శించారు. బెంగళూరులో ఆప్ కార్యకర్తలు 'బ్లాక్ డే' పాటించారు. ముంబైలో తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేశారని మహారాష్ట్ర ఆప్ అధ్యక్షుడు ప్రీతి శర్మ మీనన్ పేర్కొన్నారు. శ్రీనగర్‌లో ఆప్ కార్యకర్తల మార్చ్‌ను పోలీసులు అడ్డుకొన్నారు. కోల్‌కతాలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆందోళన సందర్భంగా రెండు పార్టీల కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకొన్నది. హర్యానాలోని కురుక్షేత్రలో సీఎం నాయబ్ సింగ్ సైనీ ఇంటి ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆప్ కార్యకర్తలపై పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించడంతోపాటు లాఠీచార్జి చేశారు.

బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారు

కేజ్రీవాల్ అరెస్టును విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. దర్యాప్తు సంస్థలు సెలక్షన్ విధానంలో విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొన్నాయని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత జరుగుతున్న విపక్ష నేతల అరెస్టులపై త్వరలో ఈసీని కలుస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమత పేర్కొన్నారు. విపక్ష కూటమిని చూసి మోదీ, అమిత్‌షాలు భయపడుతున్నారని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. మోదీ సర్కార్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత పట్ల బీజేపీ ఆందోళన చెందుతున్నదని, అందుకే విపక్షాలపై దాడులు చేయిస్తున్నదని సీపీఎం పొలిట్‌బ్యూరో పేర్కొన్నది. విపక్షం లేకుండా చేయాలని అధికార బీజేపీ కుట్రలు చేస్తున్నదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగానికి బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఎన్సీపీ నేత శరద్ పవార్ స్పష్టం చేశారు. బీజేపీకి ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ హెచ్చరించారు. కాగా, మద్యం పాలసీ అంశాలకు దూరంగా ఉండాలని తాను కేజ్రీవాల్‌ను గతంలో హెచ్చరించానని, అయితే అతని పనుల కారణంగా తను అరెస్టు అయ్యారని సామాజిక కార్యకర్త అన్నాహజారే వ్యాఖ్యానించారు.

మొహాలీలో ఆప్ మద్దతుదారులను చెదరగొట్టేందుకు జల ఫిరంగుల ప్రయోగం

బీహార్‌లోని భేజా-బకూర్ మధ్య నిర్మితమవుతున్న వంతెన శుక్రవారం కూలిపోవడంతో ఒకరు మృతి చెందగా, మరో 9 మంది గాయపడ్డారు. రూ.1,200 కోట్లతో నిర్మిస్తున్న ఈ వంతెన పొడవు 10.2 కిలోమీటర్లు. దీని నిర్మాణం పూర్తయితే దేశంలోనే అతి పెద్ద వంతెనగా రికార్డులకు ఎక్కుతుంది.

ఇదిగో 'జాబితా'.. నీదే పెండ్లి బాధ్యత!

కర్ణాటకలో దేవుడికి పెండ్లికాని ప్రసాదుల మొర

చిక్కమగళూరు, మార్చి 22: వయసు పెరుగుతున్నా పెండ్లి కాకపోవడంతో ఇక తమకు దేవుడే దిక్కు అంటున్నారు కర్ణాటకలోని చిక్కమగళూర్ జిల్లా బ్యాడిగెరె గ్రామ అవివాహితులు! వీలైనంత త్వరగా తమకు మంచి అమ్మాయిని వెతికి పెట్టమని దేవుడికి తమ 'జాబితా'ను సమర్పించారు. గ్రామంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయ హుండీలో సుగి జాత్రా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఈ జాబితాను హుండీలో వేసి దేవుడా నీదే భారం అన్నారు! ఆలయంలోని అజ్జయ్య స్వామి, అన్నపూర్ణేశ్వరిలకు ప్రత్యేక పూజలు చేశారు. పనిలోపనిగా తమ జాబితాను పరదేశప్ప మఠానికి కూడా పంపించారు. ఇలా చేస్తే దేవుడు తమ కోరికలను నెరవేరుస్తాడని పెండ్లికాని ప్రసాదులు నమ్ముతున్నారు. జాబితాలో 25-38 ఏండ్ల వయసు కలిగిన 30 మంది యువకుల పేర్లు ఉన్నాయి.

కెనడాలో విదేశీ వర్కర్లపై పరిమితి!

ఒట్టావా, మార్చి 22: గృహ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో దేశంలోకి ఉపాధి కోసం భారీగా వస్తున్న విదేశీ వర్కర్ల విషయంలో కెనడా ప్రభుత్వం ఆంక్షలు విధించనున్నది. తొలిసారిగా తాత్కాలిక విదేశీ వర్కర్లను తగ్గించేందుకు నిర్ణయించింది. ఆంక్షలు మే 1 నుంచి అమల్లోకి రానున్నాయని అధికారులు చెప్పారు. తాత్కాలిక నివాసితుల సంఖ్యను రానున్న 2-3 ఏండ్లలో ఐదు శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. విద్య, ఉపాధి నిమిత్తం విదేశస్తులు భారీగా పోటెత్తుతున్న నేపథ్యంలో కెనడాలో గృహ సంక్షోభం నెలకొన్న విషయం తెలిసిందే.

మోదీకి భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం

థింపూ, మార్చి 22: భారత ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం లభించింది. భూటాన్‌లో అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ద డ్రూక్ గ్యాల్పో'ను శుక్రవారం ఆయన అందుకున్నారు. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి విదేశీ ప్రభుత్వాధినేతగా మోదీ నిలిచారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్ చేతుల మీదుగా ప్రధాని ఈ అవార్డును అందుకున్నారు.

అమెరికాలో జాగ్రత్త

- స్థానిక చట్టాలను గౌరవించటం చాలా ముఖ్యం
- విపత్తులు తెచ్చే పరిస్థితులకు దూరంగా ఉండండి
- భారత విద్యార్థులకు ఇండ్రానూయి సూచనలు

న్యూయార్క్, మార్చి 22: అమెరికాలో భారతీయులు, భారతీయ మూలాలున్న విద్యార్థుల హత్యలు, అదృశ్యం కేసులు ఎక్కువవుతున్న తరుణంలో మన దేశ విద్యార్థులకు పెప్సికో మాజీ సీఈవో ఇంద్రానూయి కీలక సూచనలు చేశారు. స్థానిక చట్టాలను గౌరవిస్తూ జాగ్రత్తగా మసలుకోవాలని సూచించారు. ఈ మేరకు ఒక వీడియో సందేశాన్ని భారత రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఈ మధ్య కొందరు విద్యార్థులు ఎదుర్కొన్న దురదృష్టకర సంఘటనల గురించి తెలిసింది. అందుకే ఈ వీడియో రికార్డు చేస్తున్నా. ఇక్కడి పరిస్థితుల్లో మీరు జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. రాత్రి సమయంలో చీకటి ప్రదేశాలకు ఒంటరిగా వెళ్లొద్దు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి. అతిగా మద్యం సేవించకండి. ఇవన్నీ విపత్తుకు దారితీసేవే. అమెరికాకు వచ్చిన కొత్తలో స్నేహితులు, అలవాట్లపై జాగ్రత్తగా ఉండాలి. కఠోర శ్రమ, విజయానికి భారతీయ విద్యార్థులు చిరునామా. అదే సమయంలో కొందరు డ్రగ్స్‌కు బానిసలవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అవి ప్రాణాంతకం. మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటుంది. కెరీర్ పాడవుతుంది. వీసా స్టేటస్ గురించి తెలుసుకుంటూ ఉండండి. పార్ట్‌టైం ఉద్యోగం విషయంలో చట్టబద్ధతను తెలుసుకోండి. అమెరికాలో విదేశీ విద్యార్థిగా మీ హద్దులు గుర్తుంచుకోవాలి' అని పేర్కొన్నారు. తాజాగా హైదరాబాదీ విద్యార్థి అబ్దుల్ మహ్మద్ సహా పలువురు విద్యార్థులు కిడ్నాప్ కావటం, హత్యకు గురవటం వంటి కేసులు ఎక్కువవుతున్న నేపథ్యంలో వీడియో సందేశం ద్వారా విద్యార్థులకు ఇంద్రానూయి జాగ్రత్తలు చెప్పారు.

హెచ్-1బీ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

అమెరికాలో 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్-1బీ వీసాల ప్రారంభ రిజిస్ట్రేషన్ గడువును పొడిగించారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ మధ్యాహ్నం వరకు పొడిగిస్తున్నట్టు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం తెలిపింది. ఎంపికైన వారికి ఈనెల 31లోగా వివరాలను తెలియజేస్తామంది.

కాంగ్రెస్ 520 కోట్ల అక్రమ లావాదేవీలు

దిగ్విజయ్, కమలనాథ్‌ల ప్రమేయం

ఐటీ పునఃపరిశీలన పిటిషన్‌ను కొట్టేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 22: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తమ పార్టీ ఆదాయపు పన్ను చెల్లింపుపై ఐటీ శాఖ చేపట్టిన పునః పరిశీలనను సవాల్ చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్లను శుక్రవారం ఢిల్లీ హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. కాంగ్రెస్ లెక్కల్లో చూపకుండా సుమారు రూ.520 కోట్ల అక్రమ లావాదేవీలు జరిపినట్టు ఐటీ శాఖ కచ్చితమైన సాక్ష్యం సమర్పించిందని జస్టిస్‌లు యశ్వంత్ వర్మ, పురుషీంద్ర కుమార్ కౌరవ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ముఖ్యంగా 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో, 2013, 2018లలో జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అక్రమ లావాదేవీలు గుర్తించినట్టు పేర్కొనడమే కాక అప్పటి కాంగ్రెస్ నేతలు కమలనాథ్, దిగ్విజయ్ సింగ్‌లకు వీటితో సంబంధం ఉందని నేరారోపణకు సంబంధించిన సాక్ష్యాలను కూడా ప్రవేశపెట్టింది. ఆర్థిక సంవత్సరం ఈ నెల 31 తేదీతో ముగియనున్న ఈ సమయంలో రీ అసెస్‌మెంట్ చేపట్టడంపై కాంగ్రెస్ అభ్యంతరం చెప్పింది.

56 ఏండ్లు పిండాన్ని మోసిన మహిళ

తొలగించిన మర్నాడే మృతి

రియో: గర్భిణులు తొమ్మిది నెలలు కడుపులో బిడ్డ మోసి జన్మనిస్తారు. కానీ, బ్రెజిల్‌కు చెందిన 81 ఏండ్ల మహిళ మాత్రం 56 ఏండ్లు చనిపోయిన పిండాన్ని మోసింది. ఏడుగురు పిల్లలకు జన్మనిచ్చినప్పటికీ తన కడుపులో ఇంకో మృతి చెందిన పిండం ఉందనే విషయం ఆమెకు కూడా తెలియకపోవడం గమనార్హం. డాక్టర్లు సర్జరీ చేసి పిండాన్ని తొలగించిన మరునాడే ఆమె మరణించడం విషాదం. డానియెలా వెరా అనే మహిళ కొన్ని వారాలుగా కడుపునొప్పితో బాధపడుతూ వైద్యుల దగ్గరకు వెళ్లింది. అయితే, డాక్టర్లు ఇన్‌ఫెక్షన్ కారణంగానే నొప్పి వస్తుందని భావించి చికిత్స ఇవ్వగా నొప్పి తగ్గలేదు. దీంతో వైద్యులు 3డీ స్కానింగ్ చేయగా ఆమె కడుపులో చనిపోయిన పిండం ఉందని గుర్తించారు. దీంతో వైద్యులు సర్జరీ చేసి తొలగించగా, మరునాడే మరణించారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు వ్యాక్సిన్

లండన్, మార్చి 22: ప్రతియేటా లక్షలాది మందిని బలితీసుకుంటున్న ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు విరుగుడు కనిపెట్టే పనిలో బ్రిటన్ శాస్త్రవేత్తలు ఉన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్, యూనివర్సిటీ కాలేజ్ లండన్‌కు చెందిన శాస్త్రవేత్తలు కలిసి ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. 'లంగ్‌వ్యాక్స్'గా దీనికి పేరు పెట్టారు. ఇది ప్రపంచంలోనే మొదటి ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాక్సిన్. ఊపిరితిత్తుల క్యాన్సర్ కణాలను గుర్తించి, తొలగించేలా ఈ వ్యాక్సిన్ పని చేస్తుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మొదట మూడు వేల డోసుల వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. త్వరలోనే క్లినికల్ ట్రయల్స్ చేపట్టనున్నారు.

జన్యుమార్పిడి ఆవు పాలతో ఇన్సులిన్

న్యూయార్క్, మార్చి 22: ప్రపంచవ్యాప్తంగా ఒకవైపు మధుమేహ బాధితులు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇన్సులిన్‌కు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నది. ఫలితంగా ఇన్సులిన్ కొరత ఏర్పడుతున్నది. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇన్సులిన్ కొరతను పరిష్కరించేందుకు అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త ప్రయోగం చేపట్టారు. బ్రెజిల్‌లోని బ్రౌన్ బొవైన్ అనే రకం ఆవును జన్యుమార్పిడి చేసి ఆ ఆవు పాల నుంచి ఇన్సులిన్‌ను సేకరించారు. ఇలా జన్యుమార్పిడి చేసిన ఒక ఆవు పాలలో మనుషులకు ఉపయోగపడే ప్రొఇన్సిలిన్, ఇన్సులిన్ ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

పుష్పక్ ప్రయోగం సక్సెస్

బెంగళూరు, మార్చి 22: అంతరిక్ష యాత్రల ఖర్చును తగ్గించడంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) కీలక ముందడుగు వేసింది. రీయూజబుల్ లాంచ్ వెహికిల్ (ఆర్ఎల్‌వీ)-ఎల్ఈఎక్స్-02 ద్వారా పునర్వినియోగ వాహన నౌక సాంకేతికతను విజయవంతంగా పరీక్షించినట్టు శుక్రవారం ఇస్రో ప్రకటించింది. కర్ణాటకలోని చిత్రదుర్గలో ఉన్న ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి శుక్రవారం ఉదయం 7.10 గంటలకు ఈ ప్రయోగం నిర్వహించారు. రామాయణంలోని పుష్పక విమానం పేరుతో 'పుష్పక్'గా నామకరణం చేసిన ఈ వాహక నౌకను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. పరీక్షలో భాగంగా కృత్రిమంగా అడ్డంకులు సృష్టించినప్పటికీ అన్నింటినీ సరిచేసుకుంటూ ముందుగా నిర్దేశించిన విధంగా, పూర్తి కచ్చితత్వంతో స్వయంగా ల్యాండ్ అయ్యింది. దీనికి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బ్రేక్ పారాచూట్, ల్యాండింగ్ గేర్ బ్రేకులు, నోస్ వీల్ స్టీరింగ్ వ్యవస్థ ద్వారా రన్‌వేపై దానికదే ఆగిపోయింది. దీనితో రోబోటిక్ ల్యాండింగ్ సామర్థ్యాన్ని భారత్ నిరూపించుకుంది. పునర్వినియోగ వాహన నౌక సాంకేతికత అభివృద్ధిపై ఇస్రో 15 ఏండ్ల నుంచి పని చేస్తుంది. 2012లో ఇస్రో రూపొందించిన మొదటి వాహన నౌక డిజైన్‌ను జాతీయ రివ్యూ కమిటీ ఖరారు చేసింది. 2016లో మొదటి రీయూజబుల్ లాంచ్ వెహికిల్‌ను తయారు చేసింది.



విశ్వంలో శివ-శక్తి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): 'శివ-శక్తి' కలయికే అనంత విశ్వ ఆవిర్భావానికి మూలమని పురాణాలు చెబుతున్నాయి. మానవ మనుగడకు ఆధారమైన భూగ్రహం పాలపుంత గెలాక్సీలో ఉన్నది. అయితే, ఈ పాలపుంత కూడా రెండు నక్షత్ర సముదాయాల (చిన్న గెలాక్సీలు) కలయికతో ఏర్పడినట్టు గుర్తించామని మాక్స్‌ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు గురువారం తెలిపారు. సుమారు 1200-1300 కోట్ల ఏండ్